# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 9, జులై 2026




## బాసర గోదారమ్మకు జలకళ..

# ధర్మాబాద్ ఫ్యాక్టరీ వల్ల విషతుల్యం



- పెరిగిన నీటిమట్టంతో పులకరిస్తున్న గోదావరి ఘాట్లు
- బాబ్లీ గేట్లు ఎత్తిన తరుణంలోనే భారీగా రసాయనాలు వదులుతున్న మహారాష్ట్ర ఆల్కహాల్ ఫ్యాక్టరీ
- రోగాల బారిన పడుతున్నామని సరిహద్దు గ్రామ ప్రజల ఆగ్రహం..
- చర్యలకు డిమాండ్

**భైంసా, జులై 08, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయ సమీపంలో గోదావరి నది వరద నీటితో జలకళలాడుతోంది. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లి గోదావరిలోకి వరద నీరు వచ్చి చేరుతోంది. దీనికితోడు ఈనెల జూలై 1న బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తివేయడంతో బాసర వద్ద గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. గత నెలలో నదిలో నీరు పూర్తిగా అడుగంటిపోవడంతో దర్శనానికి వచ్చే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం నదిలో నీరు పుష్కలంగా ప్రవహిస్తుండడంతో భక్తులు ఘాట్ల వద్ద సురక్షితంగా స్నానాలు ఆచరిస్తున్నారు. గోదావరి పులకరిస్తుండడంతో అటు రైతన్నలు, ఇటు స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ధర్మాబాద్ ఆల్కహాల్ ఫ్యాక్టరీ నుంచి విష వ్యర్థాల విడుదల:

ఇదిలా ఉంటే, బాసర గోదావరి నదిలోకి మహారాష్ట్ర సరిహద్దులోని ధర్మాబాద్ తాలూకాలో గల పయనీర్ ఆల్కహాల్ ఫ్యాక్టరీ నుండి భారీగా విషపూరిత రసాయన వ్యర్థాలను విడుదల చేస్తుండడం కలకలం రేపుతోంది. బాబ్లీ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి నీటి ప్రవాహం పెరిగిన తరుణాన్ని ఆసరాగా చేసుకుని, సదరు ఫ్యాక్టరీ యాజమాన్యం తాము భారీ గుంతల్లో నిల్వ ఉంచిన మిగతా 2లో..

# ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తాం

✪ ఎంపీ గోడం నాగేష్ ✪ కొత్త సార్సాలలో నూతన గ్రామపంచాయతీ భవనం ప్రారంభం



**కాగజ్‌నగర్ రూరల్, జూలై 8, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని కొత్త సార్సాల గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజిఎన్ఆర్ఈజిఎస్) కింద నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు గోడం నాగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా అందించిన పుల్ల మల్లయ్య, పుల్ల రాయమల్లు దాతలను ఎంపీ ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎంపీ గోడం నాగేష్ మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఈజీఎస్ పథకాన్ని విబిజి-రామ్ గా రూపాంతరం చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ప్రస్తుతం అమలులో ఉన్న 100 రోజుల ఉపాధి హామీని 125 రోజులకు పెంచి గ్రామీణ ప్రజలకు మరింత ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. గ్రామీణాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు, ఎమ్మెల్సీ దండె విఠల్, బీజేపీ మండల అధ్యక్షుడు పుల్ల అశోక్, పంచాయతీ కార్యదర్శి సుమలత, సర్పంచులు కొండగోర్ల ప్రకాష్, అగ్గిళ్ల శ్రీనివాస్, బికాస్ గారమి, మాజీ సర్పంచ్ దోతుల శ్రీనివాస్, నాయకులు బాపురావు, గడ్డం తిరుపతి, లోనరే రవీందర్, అలగం పెంటయ్య, రన్వీర్ బిస్వాస్, గజ్జి రాకేష్, సుధాకర్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలి

✪ అదనపు కలెక్టర్ వి. రాములు



**బెల్లంపల్లి, జూలై 08, ప్రభాతవార్త**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులకు ఆదేశించారు. బుధవారం నెన్నెల మండల కేంద్రం, మందమర్రి పట్టణంలోని జోన్ 1, 2 ప్రాంతాలను ఆయా మండలాల తహసిల్దార్లతో కలిసి సందర్శించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పంపిణీ చేసిన ఫారాల్లో వివరాలు నమోదు చేయించి, తిరిగి సేకరించి డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వాలంటీర్లు, బూత్ స్థాయి అధికారులు, సూపర్వైజర్ల సహకారంతో ఓటర్లకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం మందమర్రి, నెన్నెల, బెల్లంపల్లి మండలాల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్‌తో మిగతా 2లో..

# విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి

* మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**జన్నారం, జూలై 8, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని జన్నారం మండలం అక్కపల్లిగూడ గ్రామంలోని మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను జన్నారం మండల తహసిల్దార్ బక్కయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఉమర్ షరీఫ్ లతో కలిసి సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న బోధనా తీరు, రిజిస్టర్లు, వంటశాల, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పొనకల్ గ్రామంలోని భవిత వనరుల కేంద్రం, మండల పరిషత్ ఆంగ్ల మాధ్యమ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి కొనసాగుతున్న అదనపు గదులు, మూత్రశాలలు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేసి త్వరగా మిగతా 2లో..





# ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ గడువులోగా పూర్తి చేయాలి

* గాజులపేట్‌లో ఓటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్, జులై 08, ప్రభాతవార్త:**

ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం నిర్మల్ పట్టణంలోని గాజులపేట్‌లో సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఓటర్లు పూర్తి చేసి తిరిగి ఇచ్చిన ఫారాల డిజిటలైజేషన్ పురోగతిపై మిగతా 2లో..

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను వేగవంతం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

కలిసి సందర్శించి, సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, భూభారతి పెండింగ్ దరఖాస్తులు, భూ సేకరణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా సేకరించిన ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఒక పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లకే పరిమితం చేసే విధంగా హేతుబద్ధీకరణ చేపట్టాలని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి త్వరితగతిన పరిష్కరించాలని, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం భూభారతి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిందని, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, విరాసత్ వంటి భూ సంబంధిత సేవలను నిబంధనల ప్రకారం వేగవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, సర్టిఫికెట్లను నిర్ణీత గడువులోగా జారీ చేయాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధుల పట్ల కట్టుబడి ఉండాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని ఆయన సూచించారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలి

(మొదటిపేజీ తరువాయి)

పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి వంటశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కవ్వాల్ గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి తరగతి గదులు, పరిసరాలు పరిశీలించి విద్యార్థుల సంఖ్య పెంపొందించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఓ.పి. రిజిస్టర్, వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలు పరిశీలించి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణీలు, ప్రజల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని తెలిపారు. తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి, ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలుపై సమీక్షించారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 24వ తేదీ లోగా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో లబ్ధిదారులకు మంజూరైన ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం దండేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, ఓ.పి. సేవలు, ప్రతిరోజు ఆసుపత్రికి వస్తున్న ప్రజల వివరాలను పరిశీలించారు. గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రైవేట్ ఆసుపత్రులలో జరుగుతున్న ప్రసవాల వివరాలను సేకరించి పోర్టల్ లో నమోదు చేయాలని వైద్యాధికారులకు సూచించారు. వర్షాకాలం అయినందున అంటువ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటిని కాచి చల్లార్చి వడపోసి తాగే విధంగా ప్రజలకు సూచించాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి వచ్చే ప్రజలలో వ్యాప్తి చెందుతున్న వ్యాధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

## వ్యవసాయ కూలీల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

మంచిర్యాల, జులై 8, ప్రభాతవార్త

వ్యవసాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వాలు తక్షణమే పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కేంద్రంలోని కార్మిక సంఘ కార్యాలయంగూమాస అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కనికరపు అశోక్ మాట్లాడుతూ, పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు అందజేసి అటవీ శాఖ వేధింపులు నిలిపివేయాలని కోరారు. భూమిలేని పేదలకు సాగుభూమి, వ్యవసాయ కూలీలకు ఉపాధి, కూలీ రేట్ల పెంపు, ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి హామీ పనులు, పని గుర్తింపు కార్డులు, ప్రమాద బీమా వంటి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. యాంత్రీకరణతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి తగ్గి కూలీలు వలస వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు గూమాస బాపు, గంధం రాజలింగు, దుర్గం లక్ష్మి, మగ్గిడి జయ, కొడితే బాపు, స్వరూప, సిడం సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

బెజ్జూర్, జులై 8, ప్రభాతవార్త :



బెజ్జూర్ మండలంలోని పోతేపల్లి, బారెగూడ, రెబ్బెన గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను ఎంపీ గోడం నాగేష్,ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో పోతేపల్లి గ్రామంలో రూ.40 లక్షల అంచనాలతో,బారెగూడ గ్రామంలో రూ.25 లక్షల అంచనాలతో నిర్మించిన సిసి రోడ్లకు ఎంపీ గోడం నాగేష్,ఎంఎల్‌ఏ పాల్వాయి హరీష్ బాబు ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రెబ్బెన గ్రామంలో ఆదివాసీ రైతు మండిగ రాములు చేనులో ఏర్పాటు చేసిన సోలార్ మోటార్ పంపును స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామాల అభివృద్ధిలో ఉపాధి హామీ నిధులు కీలకపాత్ర పోషిస్తున్నాయని వారన్నారు. దశలవారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రెబ్బెన గ్రామంలో ఐదుగురు ఆదివాసి రైతులకు పైలట్ ప్రాజెక్టు కింద సోలార్ మోటార్ పంపులు వేయించడం జరిగిందని తద్వారా వారికి రెండు పంటలు పండించుకునే అవకాశం దక్కిందని అన్నారు. త్వరలో ఇందిరా గిరిజల వికాసం పథకం కింద గిరిజనులకు వారి చేల్లో సోలార్ వాటర్ పంప్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోతేపల్లి సర్పంచ్ రామకృష్ణ,బారేగూడ సర్పంచ్ తేలి సుశీల బాపు, భాజపా జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం,నాయకులు జాడి దిగంబర్, ఎల్కరి సంజీవ్,కొప్పుల శంకర్,వసీఉల్లా ఖాన్,కోలా కిష్టయ్య,గూడా రాకేష్,సంతోష్,బిక్షపతి, ఉమ్మరి బాలకృష్ణ,లింగాల శంకరయ్య,ముంజం రుషి,ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యాబోధనకు కృషి

### - మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య

మంచిర్యాల, జులై 8, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలలో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య అన్నారు. బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా పద్ధతులను అనుసరించాలని తెలిపారు. ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉంటూ తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, తరగతి గదిలో విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించే విధంగా బోధన సాగించాలని సూచించారు. విద్యార్థులు కొత్త విషయాలు, ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల ఆసక్తి కనబరిచేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, సెక్టోరియల్ అధికారులు భరత్ కుమార్, కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, రిసోర్స్ పర్సన్స్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## బాసర గోదారమ్మకు జలకళ.. ధర్మాబాద్ ఫ్యాక్టరీ వల్ల విషతుల్యం

(మొదటిపేజీ తరువాయి)

కల్తీ రసాయనాలను, వ్యర్థాలను రహస్యంగా గోదావరి నదిలోకి వదులుతోంది. నిర్మల్, నిజామాబాద్ జిల్లాల పరిధిలోని వివిధ మండలాల ప్రజలు, నదీ తీర గ్రామాల వారు ఈ గోదావరి నీటినే తాగునీరుగా వినియోగిస్తున్నారు. అలాగే గ్రామాలలోని పశువులు, వన్యప్రాణులు ఈ నీటిపైనే ఆధారపడుతున్నాయి. రసాయన వ్యర్థాలు కలిసి నీరు నల్లగా, కలుషితంగా మారడాన్ని చూసి తీర ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ కలుషిత నీటిని తాగడం వల్ల ప్రజలు, పశువులు భయంకరమైన రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. పవిత్రమైన గోదావరి జలాలను విషతుల్యం చేస్తున్న ధర్మాబాద్ ఆల్కహాల్ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి, కఠిన చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లాల సరిహద్దు గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎస్ఐఆర్ ఫారాల డిజిటలైజేషన్ గడువులోగా పూర్తి చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. బీఎల్ఓలు డిజిటలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి, నింపిన ఫారాలను సేకరించాలని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అంతా అత్యంత పారదర్శకంగా జరగాలని, సూపర్వైజర్లు ఈ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం స్థానికంగా నివాసం ఉంటున్న పలువురి ఇళ్లకు కలెక్టర్ స్వయంగా వెళ్లి, వారు ఫారాలను నింపుతున్న తీరును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడుతూ.. ఈ ప్రక్రియపై ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్ డెస్కులలో అధికారుల సహాయం తీసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ దేవీదాస్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, తహసీల్దార్ రాజు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం.. సమస్యల పరిష్కారానికి కృషి

ఆసిఫాబాద్ టౌన్, ప్రభాతవార్త



ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా టీజీఎస్ఆర్టీసీ పనిచేస్తోందని రీజినల్ మేనేజర్ విజయ్ భాను పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి సంస్థ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ అంశాల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రీజినల్ మేనేజర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డిపో కార్యదర్శి జాడి లక్ష్మణ్, డిపో కోశాధికారి ముకుందరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమంతో పాటు డిపో అభివృద్ధే తమ అసోసియేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. డిపోలో పెండింగ్‌లో ఉన్న వివిధ సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని రీజినల్ మేనేజర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు జాదవ్ సాంబశివరావు, డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ డిపో మేనేజర్, డిపో అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## ఆసిఫాబాద్ పట్టణ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ఆసిఫాబాద్, ప్రభాతవార్త



ఆసిఫాబాద్ పట్టణంలోని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ విగ్రహ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ పట్టణ నూతన కమిటీని జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీలో పట్టణ అధ్యక్షుడిగా దూడల అశోక్, ఉపాధ్యక్షులుగా మాటూరి జయరాజ్, సుద్దాల మురళి, ప్రధాన కార్యదర్శిగా గొడిశాల నరేష్, కోశాధికారిగా కాంపల్లి రాజలింగును ఎన్నుకున్నారు. కార్యదర్శులుగా తిరుపుల్లా నాన్నయ్య, మోతే మురళి, మోతే జాన్, సహాయ కార్యదర్శులుగా ఏముర్ల అశోక్, ఇగోరావు అశోక్, ప్రచార కార్యదర్శులుగా చెన్నూరి నగేష్, చెన్నూరి రాకేష్, తగరపు అజయ్లను ఎంపిక చేశారు. ఈ ఎన్నికల ప్రక్రియ ఎమ్మార్పీఎస్–ఎంఎస్పీ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్ రామ్, రాష్ట్ర నాయకుడు పొన్నాల నారాయణ, మాదిగ మహిళా సమైక్య జిల్లా నాయకురాలు రేగుంట యశోద, జిల్లా నాయకులు ఇప్ప నాగరాజ్, రేగుంట మహేష్ సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆసిఫాబాద్ మండలంలోని అన్ని గ్రామాల మాదిగ యువతను సమన్వయం చేస్తూ త్వరలో మండల కమిటీని కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పోల్కా రామచంద్ర, ఎగురపు సంతోష్, సిలారీ మల్లేష్, రేగుంట శ్రావణ్, పోల్కార్ విజయ్, పోల్కార్ కిషోర్, పోర్ల తిరుపతి తదితరులు, మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## బెల్లంపల్లిలో జననేత వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు


**బెల్లంపల్లి, జూలై 08, ప్రభాతవార్త**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, జననేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షులు గౌస్ భాయ్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ గ్రంథాలయ చైర్మన్ తుంగల మల్లేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి అఫ్జల్, సర్పంచ్‌లు జుమ్మడి బానయ్య, సుధమల్ల వెంకటి, జిల్లా జనరల్ సెక్రటరీ ధర్మ సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆడెపు మహేష్, యూత్ కాంగ్రెస్ టౌన్ సెక్రటరీ సాయికిరణ్, జామే మజీద్, ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ మీర్జా మెహబూబ్, పెద్ది శ్రీను, యాకూబ్, మహమ్మద్ ఫైసల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ, ఏ లోకంలో ఉన్నా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

## సింగరేణికి స్వర్ణయుగం తెచ్చిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

### - తాడిచర్ల2 గని కేటాయింపు చారిత్రాత్మక నిర్ణయం

**బెల్లంపల్లి, జూలై 08, ప్రభాతవార్త**



సింగరేణి సంస్థ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తీసుకున్న తాడిచర్ల-2 గని కేటాయింపు నిర్ణయం చారిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే అమూరాజుల శ్రీదేవి అన్నారు. ఎటువంటి వేలం లేకుండా గనిని సింగరేణికి కేటాయించడం ద్వారా సంస్థకు మరో 50 సంవత్సరాల భవిష్యత్ భద్రత లభించిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల సుమారు రూ.64 వేల కోట్ల ఆదాయం సాధించే అవకాశం ఉండడంతో పాటు, 2000 మందికి పైగా ఉపాధి అవకాశాలు కలుగనున్నాయని తెలిపారు. అలాగే రూ.3000 కోట్ల ఆదా, తెలంగాణ ప్రభుత్వానికి రూ.16 వేల కోట్ల ఆదాయం సమకూరనుందని చెప్పారు. ఇంత కీలకమైన నిర్ణయం తీసుకున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి సింగరేణి కార్మికులు, వారి కుటుంబాల తరఫున అమూరాజుల శ్రీదేవి మాజీ ఎమ్మెల్యే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృతజ్ఞతలు తెలిపారు.

## పేద ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### - 12 మందికి రూ. 5,69,500 సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

**నేరడిగొండ, జూలై 8, ప్రభాతవార్త:**

పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ఆడే గజేందర్ చెప్పారు. బుధవారం నేరడిగొండలోని తన క్యాంపు కార్యాలయంలో 12 మంది లబ్ధిదారులకు రూ. 5,69,500 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలను ఆదుకోవడంలో ప్రభుత్వం ముందుంటుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చూస్తామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో తమకు ఆర్థిక సాయం అందించినందుకు లబ్ధిదారులు ప్రభుత్వానికి, ఆడే గజేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు

**బెల్లంపల్లి, జూలై 08, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా విద్యాశాఖ అధికారి పి. చంద్రయ్య తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్‌కు బలమైన పునాది వేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఆధునిక బోధనా విధానాలను అనుసరించాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉంటూ తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం మరియు సృజనాత్మక ఆలోచనలను పెంపొందించేలా బోధన కొనసాగించాలని సూచించారు. విద్యార్థులు కొత్త విషయాలు, ఆవిష్కరణలు, పరిశోధనల పట్ల ఆసక్తి కనబరచేలా ప్రోత్సహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ జంబోజు సత్తయ్య, సెక్టోరియల్ అధికారులు భరత్ కుమార్, కృష్ణమూర్తి, జిల్లా సైన్స్ అధికారి రాజగోపాల్, ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, రిసోర్స్ పర్సన్స్, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**బుద్ధకాలన్‌లో వన మహోత్సవం, ప్లాస్టిక్ వ్యర్థాల షెడ్‌కు భూమిపూజ..**

బెల్లంపల్లి మండలంలోని బుద్ధకాలన్ గ్రామపంచాయతీలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేసి, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు



నాటారు. గ్రామాలను పరిశుభ్రంగా, పర్యావరణహితంగా తీర్చిదిద్దేందుకు ఘన, ద్రవ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు గ్రామపంచాయతీలు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శాఖల వారీగా కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయడానికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ప్రజలు మొక్కలు నాటి సంరక్షించేలా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎన్. కిషన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మహేందర్, పంచాయతీరాజ్ డి.ఈ.ఈ. రవీందర్, గ్రామ సర్పంచ్ దాడి నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

**భీమినిలో వన మహోత్సవం కార్యక్రమం..**

భీమిని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. భావితరాలకు సమతుల్యమైన సహజ వాతావరణాన్ని అందించడంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. అనంతరం వడల, జగ్గయ్యపేట గ్రామాలలో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, అభివృద్ధి పనులను పరిశీలించి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కేస్లాపూర్ గ్రామపంచాయతీలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ఎంపీపీఎస్ కేస్లాపూర్-గట్టుపల్లి పాఠశాలను సందర్శించి మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి వారి అభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలపై ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, తగిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## శాంతిభద్రతలకు సీసీ కెమెరాలే మూడో కన్ను

### - వ్యాపార సంస్థల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి: సీఐ రమేష్

**మందమర్రి, జూలై 08, ప్రభాతవార్త**

పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, వ్యాపారస్తుల భద్రతకు సీసీ కెమెరాల ఏర్పాటు అత్యంత కీలకమని మందమర్రి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ అన్నారు. మందమర్రి సీఐ రమేష్, ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం రోడ్డు పక్కన వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణదారులు, వ్యాపార సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపార సముదాయాలు, ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి అవసరం, నేరాల నియంత్రణలో వాటి పాత్రపై వివరించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా నేరాలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. ప్రతి వ్యాపార సంస్థ వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద కెమెరాలు ఉండటం వల్ల దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల్లో భయం ఏర్పడి నేరాలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. ఏదైనా నేరం జరిగినప్పుడు సీసీటీవీ ఫుటేజ్ నిందితులను వేగంగా గుర్తించి కేసులను త్వరితగతిన ఛేదించేందుకు పోలీసులకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో, రద్దీ సమయాల్లో వ్యాపార సంస్థల భద్రతకు సీసీ కెమెరాలు సమర్థవంతమైన రక్షణగా నిలుస్తాయని వివరించారు. కెమెరాల ఏర్పాటు విషయంలో ఒక కెమెరాను దుకాణం లోపలి భాగాన్ని, మరో కెమెరాను రహదారిపై వెళ్లే వాహనాలు, వ్యక్తులు స్పష్టంగా కనిపించేలా బయటివైపు అమర్చాలని సూచించారు. ఈ సమావేశంలో మందమర్రి పోలీసు సిబ్బందితో పాటు స్థానిక దుకాణదారులు, వ్యాపార సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పోలీసుల సూచనలకు సానుకూలంగా స్పందించిన వ్యాపారులు, శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా త్వరలోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటామని హామీ ఇచ్చారు. పట్టణ భద్రతలో పోలీసులతో పాటు ప్రజలు, వ్యాపారులు కూడా భాగస్వాములు కావాలని, ఖమీ భద్రత.. మీ చేతుల్లోనే ఉంది - ప్రతి దుకాణానికి సీసీ కెమెరా తప్పనిసరిగా అని పోలీసులు పిలుపునిచ్చారు.

## కాసిపేట 2 ఇంక్లైన్ గనిలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

**బెల్లంపల్లి, జూలై 08, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కాసిపేట తాడిచర్ల బ్లాక్-2 గనిని ఎటువంటి వేలం పాట లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు కేటాయించిన సందర్భంగా కాసిపేట 2 ఇంక్లైన్ గని ఆవరణలో బీఎంఎస్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి, కార్మికులకు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కోడి రమేష్ మాట్లాడుతూ తాడిచర్ల బ్లాక్-2 గనిని ఎటువంటి వేలం పాట లేకుండా కేంద్ర ప్రభుత్వం సింగరేణికి కేటాయించడం గొప్ప విషయం అని పేర్కొన్నారు. ఈ గని ద్వారా సింగరేణి సంస్థకు సంవత్సరానికి సుమారు 6000 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగే అవకాశముందని, దాదాపు రూ.64 వేల కోట్ల ఆదాయం లభించడంతో పాటు సుమారు 1200 మందికి ఉపాధి అవకాశాలు కలుగుతాయని తెలిపారు. అదేవిధంగా భవిష్యత్తులో మరికొన్ని బొగ్గు బ్లాకులను కూడా సింగరేణి సంస్థ వేలం పాటలో పాల్గొంటే కేంద్ర ప్రభుత్వం కేటాయించడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు ఏరియా ఉపాధ్యక్షుడు గుర్రం ప్రదీప్, ఏరియా కార్యదర్శి చెట్టి వీరన్న, కేకే ఓసీ ఫిట్ సెక్రటరీ మంద రజినీకాంత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, బీజేపీ నాయకులు జిల్లా కార్యదర్శి రాచర్ల సంతోష్ కుమార్, కాసిపేట మండల అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ప్రసన్న, ఏరోజు శ్రీనివాస్, తోటపల్లి ఓం సాయి తదితరులు పాల్గొన్నారు.



# టాస్క్ ద్వారా ముగ్గురు జిల్లా వాసులకు ఉద్యోగాలు

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**నస్పూర్, జూలై 8, ప్రభాతవార్త**



నిరుద్యోగ యువతకు టాస్క్ కేంద్రంగా వివిధ సాంకేతిక కోర్సులలో అందిస్తున్న శిక్షణ ద్వారా జిల్లాకు చెందిన ముగ్గురికి క్యాంపస్ ప్లేస్మెంట్ లో ఉద్యోగాలు లభించాయని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ సాంకేతిక కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా టాస్క్ కేంద్రం ద్వారా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో టాస్క్ కేంద్రంలో శిక్షణ పొందిన జి. కావ్య, ఎమ్. అంజలి, కె. సాయివాణిలు అత్యున్నత ప్రతిభ కనబరిచి టిసిఎస్ (గిదిళీ) క్యాంపస్ ప్లేస్‌మెంట్ ఎంపికై ఉద్యోగాలు పొందడం అభినందనీయమని తెలిపారు. టాస్క్ కేంద్రంగా అందిస్తున్న శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకొని ఉపాధి పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## భద్రత కోసం ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

**- నిర్మల్ రూరల్ సీఐ ఎం. కృష్ణ**

**- అరె మైసమ్మ దేవాలయం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో మొక్కల పెంపకం**

**సారంగాపూర్, జూలై 08, ప్రభాతవార్త:**

గ్రామాల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం గ్రామాల్లో సిసి కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని నిర్మల్ రూరల్ సీఐ ఎం. కృష్ణ సూచించారు. సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామంలో బుధవారం ఆయన గ్రామస్థులతో ఒక ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు, దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయన్నారు. ముఖ్యంగా వ్యాపారస్తులు, దుకాణదారులు తమ తమ వ్యాపార సముదాయాల వద్ద సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. చించోలి (బి) గ్రామం ప్రధాన రహదారి పక్కనే ఉండడం వల్ల నిరంతరం కొత్త వ్యక్తులు, అనుమానితులు వచ్చే అవకాశం ఉందని, అలాంటి వారి కదలికలపై గ్రామస్థులు ఎల్లప్పుడూ నిఘా ఉంచాలని సూచించారు. సీఐ పిలుపునకు స్పందించిన స్థానిక సర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) సభ్యులు.. గ్రామంలో త్వరలోనే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చారు. అనంతరం, వనమహోత్సవంలో భాగంగా పోలీసుల ఆధ్వర్యంలో గ్రామస్థులతో కలిసి స్థానిక అరె మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ ఎస్సై శ్రీకాంత్, చించోలి (బి) గ్రామ సర్పంచ్ సాయన్న, ఉపసర్పంచ్ పోశెట్టి, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, పోలీస్ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మద్యానికి బానిససై యువకుడు ఆత్మహత్య

**దహెగాం, జూలై 8, ప్రభాతవార్త :**

దహెగాం మండలం కుంచెవెల్లి గ్రామంలో లంగారీ సుమన్ (26) అనే యువకుడు మద్యం మత్తులో గొంతు కోసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు దహెగాం ఎస్ ఐ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా అయన చెప్పిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన లంగారీ సత్తయ్య భార్య ఆరు సంవత్సరాల క్రితం మృతి చెందింది సత్తయ్య కు ఇద్దరు కుమారులు సురేష్, సుమన్ అతని పెద్ద కొడుకు సురేష్ హైదరాబాద్ లో ఉద్యోగం చేస్తున్నాడు. చిన్న కొడుకు సుమన్, తన అత్త కలిసి కొంచవెల్లి గ్రామంలో ఉంటున్నారు. సుమన్ మద్యానికి బానిస అయ్యాడు. రైతు భరోసా డబ్బులు రావడంతో తాగుడు మరింత ఎక్కువ అయిందని బుధవారం ఉదయం మద్యం మత్తులో ఇంట్లో కి వెల్లి తలుపులు మూసుకున్నాడు. చాలా సేపు అయిన తలుపులు తెరువకపోవడంతో అనుమానం వచ్చి సతయ్య పక్కింటి వాళ్ళను పిలిచి కిటికీలో నుంచి చూసే సరికి సుమన్ రక్తం మడుగులో పడి ఉన్నాడని తలుపులు పగులగొట్టి చూడగా కత్తి ఉందని దానితో గొంతు కోసుకున్నాడని కత్తితో పాటు తాడు, పురుగుల మందు ఉన్నాయని తెలిపారు. ఈ మృతిపై ఎలాంటి అనుమానం లేదని మృతుడి తండ్రి సత్తయ్య ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ ఐ పేర్కొన్నారు.

## కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్

**కెరమెరి జూలై 8 ప్రభాతవార్త:**



ఆసిఫాబాద్ జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ 12 కొనసాగుతోంది. జిల్లాలోని కెరమెరి మండలంలోని గిరిజన గ్రామాలైన అంబరావుగూడ, గోయగాం, కొరారి ప్రాంతాల్లో ఎస్సైలు బిక్కులాల్, ఉల్లాస్ జాదవ్, బాలల సంక్షేమ శాఖ అధికారులు చంద్రశేఖర్, సుకన్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశాలలో ఎక్కడ కూడా బాలలను పనిలో పెట్టుకోకూడదన్నారు. జిల్లాలో మొత్తం మూడు టీంలు జూలై 1 నుండి జూలై 31 వరకు ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే వారిని అదుపులోకి తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తున్నామన్నారు. బాలలను తిరిగి పాఠశాలకు పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎక్కడైనా బాలలను పనిలో పెట్టుకుంటే వెంటనే సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉత్తం పోలీస్ కానిస్టేబుళ్లు దినేష్, సర్దార్ పాల్గొన్నారు.

## పలు కుటుంబ సభ్యులను పరామర్శించిన బలరాం జాధవ్

**- బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, ధైర్యం కల్పించిన నాయకుడు**

**నేరడిగొండ, జూలై 8, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలం పెద్ద బుగ్గారం, చిన్న బుగ్గారం గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బలరాం జాధవ్ బుధవారం పరామర్శించారు. పెద్ద బుగ్గారం గ్రామానికి చెందిన నాథరి సతీష్ కుమార్ ఇటీవల దారుణ హత్యకు గురై మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బలరాం జాధవ్ బాధిత నివాసానికి వెళ్లి, శోకసంద్రంలో ఉన్న సతీష్ కుమార్ తల్లిని పరామర్శించారు. ఆమెను ఓదార్చి మనోధైర్యాన్ని చెబుతూ, తక్షణ అవసరాల నిమిత్తం కొంత ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఏ ఆపద వచ్చినా తాము అండగా ఉంటామని ఆ కుటుంబానికి గట్టి భరోసా ఇచ్చారు. అనంతరం, అదే గ్రామానికి చెందిన సువాలి అనే వృద్ధురాలు మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అలాగే, చిన్న బుగ్గారం గ్రామానికి చెందిన కమల అనే మహిళ మరణించిన విషయం తెలుసుకుని వారి గృహాన్ని కూడా సందర్శించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు బలరాం జాధవ్



## గ్రామాల్లో కొనసాగుతున్న ఓటరు సవరణ ప్రక్రియ

**చెన్నూరు, జూలై 8, ప్రభాతవార్త**

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వచ్చిన ఓటరు సవరణ ప్రక్రియ (సర్) చెన్నూరు నియోజకవర్గ వ్యాప్తంగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా కోటపల్లి మండలం బబ్బరచెలుక గ్రామంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా మండలద్యక్షుడు అసంపల్లి సంపత్ ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ దరఖాస్తూలు నింపుతూ ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ ఓటరు సవరణ ప్రక్రియలో తప్పకుండ పాల్గొని ఓటును కోల్పోకుండా చూసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రంజిత్,బాపు, రాజేష్, చకినారపు అజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఆర్‌పీ3 గని మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీజీఎంఎస్ అధికారులు, జీఎం మునిగంటి శ్రీనివాస్

## శ్రీరాంపూర్‌లో నేడు త్రైపాక్షిక భద్రతా సమీక్ష

**గనుల్లో డీజీఎంఎస్ తనిఖీలు**

**నస్పూర్, జూలై 8, ప్రభాతవార్త**

శ్రీరాంపూర్ ఏరియా గెస్ట్ హౌస్‌లో గురువారం 24వ ఏరియా స్థాయి త్రైపాక్షిక భద్రతా సమీక్షా సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు బుధవారం ఏరియాకు విచ్చేసిన డీజీఎంఎస్ అధికారులు డీఎంఎస్ సాగేష్ కుమార్, డీడీఎంఎస్ దీపక్ కుమార్‌లను ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. అనంతరం అధికారుల బృందం ఎస్ఆర్‌పీ3 భూగర్భ గనిని సందర్శించి, ఇటీవల జరిగిన ప్రమాదాల వివరాలపై సమీక్షించారు. అనంతరం భూగర్భంలోకి దిగి 5వ సీమ్‌లోని ఎస్ఎస్4 ప్యానల్‌ను తనిఖీ చేసి రక్షణ సూచనలు చేశారు. మరో అధికారి డీడీఎంఎస్ కోమల్ చౌదరి ఎస్ఆర్‌పీ ఓసీ గనిలోని సబ్‌స్టేషన్, వర్క్‌షాప్‌లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సేఫ్టీ జీఎం రఘు కుమార్, ఏజెంట్ రవికుమార్, మేనేజర్ వెంకట్రావు పాల్గొన్నారు.

## ధాన్యం తరలించు వాహనాలకు జిపిఎస్ తప్పనిసరి

**- మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**

**నస్పూర్, జూలై 8, ప్రభాతవార్త**

వరి ధాన్యం తరలించు వాహనాలకు జిపిఎస్ తప్పనిసరిగా అమర్చాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఛాంబర్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ లతో కలిసి ధాన్యము, గన్ని సంచులు రవాణా చేయు వాహనాల గుత్తేదారులతో వెహికల్ లొకేషన్ ట్రాకింగ్ సిస్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ నాటికి ధాన్యము, గన్ని సంచులు రవాణా చేయు వాహనాలన్నింటికీ జిపిఎస్ ట్రాకింగ్ తప్పనిసరిగా అమర్చాలని రవాణా గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌పై దాడి: అధ్యాపకుల నల్ల బ్యాడ్జీల నిరసన

### పరీక్షల్లో కాపీయింగ్ పట్టుకున్నందుకు దాడికి తెగబడ్డ విద్యార్థినిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు

**భైంసా, జులై 08, ప్రభాతవార్త:**



భైంసా పట్టణంలోని గోపాల్‌రావు పాటిల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ పరీక్షల సందర్భంగా ప్రిన్సిపాల్‌పై జరిగిన భౌతిక దాడిని అధ్యాపకులు, కాలేజ్ ప్రమోషన్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ (సీపీడీసీ) సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనకు నిరసనగా బుధవారం కళాశాల సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ కర్రోళ్ల బుచ్చయ్య మంగళవారం సాయంత్రం పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తుండగా, ఒక విద్యార్థి కాపీ కొడుతూ పట్టుబడ్డారు. ప్రిన్సిపాల్ అతని సమాధాన పత్రాన్ని స్వాధీనం చేసుకోగా, ఆగ్రహానికి లోనైన ఆ విద్యార్థి ప్రిన్సిపాల్ చేతుల నుండి దాన్ని బలవంతంగా లాక్కొని చించివేశారు. అంతటితో ఆగకుండా ప్రిన్సిపాల్‌పై భౌతిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందిని తోసివేసి, సదరు విద్యార్థి సమీపంలోని గోడ దూకి పరారయ్యారు. ఈ దారుణ ఘటనపై కళాశాల అధ్యాపక బృందం, సీపీడీసీ అధ్యక్షుడు డాక్టర్ నాగేష్, జనరల్ సెక్రటరీ మనోజ్ తదితరుల ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాలను పరిశీలించిన పోలీస్ అధికారులు, నిందితుడిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విధులను నిర్వర్తిస్తున్న అధికారులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి, విద్యా వ్యవస్థకే ముప్పుగా మారుతుందని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంస్థల సిబ్బంది ఎలాంటి భయం లేకుండా విధులు నిర్వహించేలా ప్రభుత్వం, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతాం : డాక్టర్ అనిత

**కాగజ్‌నగర్ రూరల్, జూలై 8, ప్రభాతవార్త :**

వైద్య వృత్తిని సేవా ధర్మంగా భావిస్తూ ప్రజలకు అంకితభావంతో సేవలందిస్తున్న ప్రముఖ వైద్యురాలు డాక్టర్ అనిత శ్రీనివాస్ భవిష్యత్తులో మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. ఇటీవల లయన్స్ క్లబ్ ఆఫ్ కాగజ్‌నగర్ అధ్యక్షురాలిగా ఎన్నికైన సందర్భంగా ఆమె తన సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లయన్స్ క్లబ్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మరింత బాధ్యతతో సమాజానికి సేవలు అందిస్తానని చెప్పారు. వైద్య సేవలతో పాటు సామాజిక బాధ్యతను కూడా సమర్థంగా నిర్వర్తించడం తన లక్ష్యమని పేర్కొన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు సుమారు 9 వేల మందికి విజయవంతంగా కంటి శస్త్రచికిత్సలు చేయించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సల ద్వారా వేలాది మంది తిరిగి చూపు పొందడం తమకు ఎంతో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ఇప్పటివరకు తమ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి శస్త్రచికిత్సల్లో ఎలాంటి సమస్యలు తలెత్తలేదని వెల్లడించారు. ప్రతి మంగళవారం కాగజ్‌నగర్ కిమ్స్ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ, రోగులకు కంటి పరీక్షలు చేసి, శస్త్రచికిత్స అవసరమైన వారికి ప్రత్యేక తేదీలు కేటాయించి విజయవంతంగా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని వివరించారు. అదేవిధంగా నిరుపేదలకు ఉచిత అంబులెన్స్ సేవలు, డెడ్ బాడీ ఫ్రీజర్ సేవలు అందిస్తూ మానవతా దృక్పథంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆరోగ్యం, విద్య, సామాజిక సంక్షేమ రంగాల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మరింత చేరువయ్యేలా కృషి చేస్తాం. సమాజ సేవే మా ప్రధాన లక్ష్యం అని డాక్టర్ అనిత శ్రీనివాస్ స్పష్టం చేశారు.



# కేజీబీవీ హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలికను గుర్తించిన పోలీసులు

- సురక్షితంగా తల్లికి అప్పగించిన కోటపల్లి పోలీసులు

- సాంకేతిక పరిజ్ఞానంతో చాకచక్యంగా ఛేదించిన పోలీస్ బృందాలు.. సిబ్బందిని అభినందించిన జైపూర్ ఏసీపీ

**కోటపల్లి, జూలై 08, ప్రభాతవార్త**

కోటపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ) హాస్టల్ నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థినిని కోటపల్లి పోలీసులు చాకచక్యంగా శ్రమించి కరీంనగర్‌లో సురక్షితంగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం.. సదరు బాలికకు హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేదని గత కొంతకాలంగా తన తోటి విద్యార్థులతో, అలాగే తన తల్లితో చెబుతూ ఉండేది. ఈ క్రమంలో బాలిక తల్లి ఆమెకు నచ్చజెప్పి హాస్టల్‌లోనే ఉండి చదువుకోవాలని సూచించినప్పటికీ, బాలికకు అక్కడ ఉండడం ఇష్టం లేకపోవడంతో ఈ నెల 5వ తేదీ ఉదయం ఎవరికీ చెప్పకుండా హాస్టల్ నుండి వెళ్ళిపోయింది. ఈ విషయమై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి, కోటపల్లి ఎస్సై రాజశేఖర్ దర్యాప్తు ప్రారంభించారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా నాలుగు పోలీసు బృందాలను ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసుల సమన్వయంతో కూడిన గాలింపు చర్యల ఫలితంగా, ఈ రోజు కరీంనగర్ బస్ స్టాండ్ పరిసర ప్రాంతంలో ఆ బాలికను సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం బాలికకు కౌన్సిలింగ్ ఇచ్చి, అవసరమైన న్యాయపరమైన ప్రక్రియలను పూర్తి చేసిన తర్వాత కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. ఈ కేసును అత్యంత వేగంగా, సమర్థవంతంగా ఛేదించడంలో చురుగ్గా పనిచేసిన చెన్నూరు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, కోటపల్లి ఎస్సై రాజశేఖర్, నిల్వాయి ఎస్సై జగదీష్ రెడ్డిలతో పాటు పోలీసు సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ బుజ్జిబాబు, కానిస్టేబుళ్లు శ్యామ్ సుందర్, శ్రీనివాస్, శ్రావణ్, సమ్మయ్య, నరేష్‌లను జైపూర్ ఏసీపీ ప్రత్యేకంగా అభినందించారు.



జాతీయ సదస్సుకు హాజరైన డిపిఆర్ఓ సంపత్ కుమార్‌కు సన్మానం చేస్తున్న జర్నలిస్టు

## జర్నలిస్టులకు డిపిఆర్ఓ అందిస్తున్న సేవలు అభినందనీయం

**ఆసిఫాబాద్, జూలై 8, ప్రభాతవార్త :**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) సంపత్ కుమార్ జర్నలిస్టులకు అందిస్తున్న సేవలు అభినందనీయమని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రహమాన్ అన్నారు. ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సుకు ఆసిఫాబాద్ జిల్లా నుంచి ఎంపికై హాజరైన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని డిపిఆర్ఓ కార్యాలయంలో టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ వెనుకబడిన జిల్లా నుంచి కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన జాతీయ సదస్సుకు డిపిఆర్ఓ సంపత్ కుమార్ హాజరు కావడం జిల్లాకే గర్వకారణమన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తూ, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు న్యాయం జరిగేలా చొరవ చూపుతున్నారని ప్రశంసించారు. ప్రభుత్వం, పాలకులు, జర్నలిస్టుల మధ్య వారధిగా వ్యవహరిస్తూ సమాచారాన్ని ఎప్పటికప్పుడు వేగంగా అందిస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రకాష్ గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్. వేణుగోపాల్, టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణంరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి దేవునూరి రమేష్, ప్రెస్ క్లబ్ కోశాధికారి శ్రీధర్, జిల్లా నాయకులు నగరారే తారు, సురేష్ చారి, రాధాకృష్ణ చారి, రాజు, జానకిరామ్, నితీష్, మోహన్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ జిల్లా పర్యటన

**ఆసిఫాబాద్, జూలై 8, ప్రభాతవార్త :**

షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ సభ్యులు జాటోతు హుస్సేన్ ఈ నెల 9వ తేదీన జిల్లాకు రానున్నారని పిఎస్ టు కమిషన్ సభ్యులు అశోక్ కుమార్ లక్కర్సు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11.30 గంటలకు జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులతో షెడ్యూల్ తెగల రక్షణ చట్టాల అమలుపై జిల్లా స్థాయి సమావేశం నిర్వహిస్తారని తెలిపారు.

## ఆసిఫాబాద్‌లో ముమ్మరంగా ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియ

**ఆసిఫాబాద్, జులై 8, ప్రభాతవార్త :**

ఆసిఫాబాద్ పట్టణంలోని బజార్ వాడి, సందీప్ నగర్ పరిధిలో బుధవారం జఎస్ఐఆర్చ దరఖాస్తుల ప్రక్రియ ప్రత్యేక కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, తహసిల్దార్ రియాజ్ అలీలతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పర్యవేక్షించారు. దరఖాస్తుల స్వీకరణ తీరును వారు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ స్వయంగా హాజరై అక్కడికి వచ్చిన ప్రజల ఎస్ఐఆర్ ఫారాలను దగ్గరుండి పూర్తి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలెవరూ నిరక్ష్యం చేయకుండా వెంటనే తమ ఎస్ఐఆర్ దరఖాస్తుల ప్రక్రియను పూర్తి చేసుకోవాలి సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ఆలస్యం చేయకుండా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, దూడల అశోక్, జయరాజ్ తదితరులతో పాటు మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



పర్యవేక్షించిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్, తహసిల్దార్

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

**తాండూర్, జూలై 8, ప్రభాతవార్త :**

ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంచి ర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు (డిసిసి) సూరం రవీందర్ రెడ్డి, మాదారం సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ అన్నారు. తాండూర్ మండలంలోని మాదారం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి బావి తరాలకు బంగారు భవిష్యత్తు బాట వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు బానేష్, కత్తెర్ల రవి కుమార్, పంచాయతీ సెక్రెటరీ శ్రీలత, ఉపాధి హామీ టి.ఏ. ప్రసాద్, నరేష్, మేట్ పుప్పాల పుష్ప, నాయకులు, విబిజి రాంజీ కూలీలు పాల్గొన్నారు.



# రైతు భరోసా నిధుల విడుదలపై కాంగ్రెస్ సంబురాలు

**- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు పాలాభిషేకం**

**- ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన ముధోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి**


**భైంసా, జులై 08, ప్రభాతవార్త:**




భైంసా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రైతు భరోసా సంబురాలను ఘనంగా నిర్వహించారు. నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఈ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ చిత్రపటాలకు నాయకులు, కార్యకర్తలు కలిసి పాలాభిషేకం చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే రైతు భరోసా నిధులను మంజూరు చేసిందని చెప్పారు. ముధోల్ నియోజకవర్గ రైతాంగం తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ జుట్టు అశోక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు తూర్పాటి వెంకటేష్, మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్, మాజీ ఉపసర్పంచ్ సబ్బిడి గజేందర్, సీనియర్ నాయకులు తాటి మహేష్, సంతోష్, రాకేష్, లక్ష్మణ్ బోగ, మాజీ ఎంపీటీసీ మధు, మాజీ సర్పంచ్ హైమాద్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

**సారంగాపూర్, జులై 08, ప్రభాతవార్త:**


గ్రామాల్లో వీధి దీపాలు, విద్యుత్ స్తంభాలు వేయిస్తున్న సర్పంచులు

మండలంలోని జాం, కౌట్ల (బి) గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం సర్పంచుల ఆధ్వర్యంలో విద్యుత్ సమస్యల పరిష్కార పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జాం గ్రామంలో సర్పంచ్ కరిపే రవళి విలాస్ ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో సెంటర్ లైటింగ్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. చిన్నూరు బస్టాండు నుండి ఇందిరమ్మ కాలనీ వరకు రాత్రి వేళల్లో విద్యుత్ దీపాలు లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్.. సింగిల్ ఫేస్ లైన్ ద్వారా నూతన వీధి దీపాలను పెట్టించారు. సంవత్సరాల నాటి తమ కోరిక నెరవేరడంతో కాలనీ ప్రజలు సర్పంచ్‌ను అభినందించారు. అలాగే, కౌట్ల (బి) గ్రామంలో సర్పంచ్ బల్గూరి అజయ్ ఆధ్వర్యంలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. గ్రామంలో పాత విద్యుత్ స్తంభాలు చాలా కాలంగా ఉండడం, కొత్తగా ఇళ్ల నిర్మాణాలు జరగడంతో.. ఆ స్తంభాలు ఇళ్లకు సమీపంలో ఉండి ప్రమాదకరంగా మారాయి. పైగా అవి చిన్నవిగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తాయి. దీంతో ప్రమాదకరంగా మారిన పాత స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో నూతన విద్యుత్ స్తంభాలను వేయించారు. ఈ పనులతో గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న విద్యుత్ సమస్యలు తీరాయి. ఈ కార్యక్రమాల్లో గ్రామ పెద్ద విలాస్, కౌట్ల (బి) ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఓటరూ దరఖాస్తు చేసుకునేలా సహాయం: కోర్వా శ్యామ్

**భైంసా, జులై 08, ప్రభాతవార్త:**



ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఎస్ఐఆర్ ఫారాల భర్తీ కార్యక్రమాన్ని చేపట్టారు. బాసర మండల కేంద్రంలోని బొర్రా గణేష్ గల్లీలో గల గణేష్ మందిరం వద్ద మంగళవారం ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచే ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తూ, ఎస్ఐఆర్ ఫారాలను పూర్తిగా నింపించి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు (బీఎల్‌వోలకు) వెంటనే అందజేశారు. ఈ సందర్భంగా బాసర మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోర్వా శ్యామ్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రజలకు పూర్తి అందుబాటులో ఉంటానని చెప్పారు. ఫారాలు నింపడంలో ఓటర్లకు ఎలాంటి సందేహాలు, ఇబ్బందులు ఉన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని సూచించారు. గడువు ముగిసే వరకు ప్రతిరోజూ ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తూ, అర్హులైన ప్రతి ఓటరు దరఖాస్తు సక్రమంగా సమర్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని, అవసరమైన పత్రాలతో వస్తే ఫారాలను పద్ధతి ప్రకారం నింపించి బీఎల్‌వోలకు అందించే బాధ్యతను తాము తీసుకుంటామని కోర్వా శ్యామ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.


ఎస్ఆర్‌పీ3 గని వద్ద ప్రధాని మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

## తాడిచర్ల-2 కోల్ బ్లాక్ కేటాయింపుపై బీజేపీ సంబరాలు

**నస్పూర్, జూలై 8, ప్రభాతవార్త**

ఎలాంటి బిడ్డింగ్ లేకుండా తాడిచర-2 కోల్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం ద్వారా సంస్థకు రూ.2,550 కోట్ల ప్రత్యక్ష లాభం, రూ.60 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ తెలిపారు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ కేటాయింపు ఉత్తర్వులు జారీ చేసినందుకు గాను బుధవారం ఎస్ఆర్‌పీ3 గని వద్ద ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలభిషేకం చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 82 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్న ఈ కోల్ బ్లాక్ ద్వారా సుమారు 50 నుండి 60 సంవత్సరాల వరకు సింగరేణికి మనుగడ సాధ్యమవుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రీరాంపూర్ జోన్ అధ్యక్షులు సత్రం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు కమలాకర్ రావు, కార్మిక సెల్ నాయకులు గోళ్ళ మహేందర్ వర్మ, గడిగొప్పుల సురేందర్, కాదాసు భీమన్న, జోన్ ప్రధాన కార్యదర్శి పొన్నవేని సదయ్య, కొండ వెంకటేష్, బొంగోని శ్రీనివాస్, నాగార్జున, పరశురాం, సత్యనారాయణ, నరసయ్య, మొగిలి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విద్యను వ్యాపారంగా మార్చొద్దు... నియంత్రణ చట్టాలను అమలు చేయాలి...

**- నవతరం విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్ డిమాండ్**

**- ఈ నెల 10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి**

**మంచిర్యాల, జూలై 8, ప్రభాతవార్త**

రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఆధిపత్యాన్ని అరికట్టి విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే డిమాండ్‌తో ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని నవతరం విద్యార్థి సమాఖ్య జిల్లా కన్వీనర్ జాబు ఆశిష్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం మంచిర్యాల పట్టణంలో విద్యార్థులు, నాయకుల సమక్షంలో బంద్‌కు సంబంధించిన ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా జాబు ఆశిష్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి తల్లిదండ్రులపై భరించలేని ఫీజుల భారం మోపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక ఫీజుల పేరుతో కుటుంబాలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తూ విద్యను సామాన్యులకు దూరం చేస్తున్నారని విమర్శించారు. ఈ పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో విద్యారంగానికి తీవ్ర ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుని, విద్యాహక్కు చట్టం, ఫీజు నియంత్రణ చట్టాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యను లాభార్జన సాధనంగా మార్చే విధానాలను అరికట్టాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రంలోని అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఐక్య కార్యాచరణ చేపట్టి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 10న నిర్వహించే విద్యాసంస్థల బంద్‌కు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు సంపూర్ణ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, అదిత్య, విఘ్నేష్, మణితేజ్, జామీర్‌తో పాటు పలువురు విద్యార్థులు, నవతరం విద్యార్థి సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సంఘం నాయకులు